## పైసలు లేకపోయినా రైలు టికెట్!

న్యూఢిల్లీ, జనవరి 23: డబ్బులు లేకపోయినా ట్రైన్ టికెట్ బుక్ చేసుకునే సదుపాయాన్ని భారతీయ రైల్వే అందుబాటులోకి తెచ్చింది. 'బుక్ నౌ.. పే లేటర్' పేరుతో తీసుకొచ్చిన ఈ కొత్త విధానం ద్వారా ఒక్క రూపాయి చెల్లించకపోయినా ట్రైన్ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఇందుకు అదనంగా ఎలాంటి చార్జీలు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, టికెట్ బుక్ చేసుకున్న 14 రోజుల్లోగా డబ్బులు చెల్లించాలి. చెల్లించకపోతే మాత్రం 3.5 శాతం సర్వీస్ చార్జ్ కట్టాల్సి ఉంటుంది. చెల్లింపు ఆలస్యమైనా కొద్ది చార్జీ పెరుగుతుంది. కాగా, ఈ పే లేటర్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు ముందుగా www.epaylater.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. టికెట్ బుక్ చేసుకున్నాక పేమెంట్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకునేటప్పుడు 'పే లేటర్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

## సింగిల్ డోస్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్!

న్యూయార్క్, జనవరి 23: రొమ్ము క్యాన్సర్ చికిత్స కాలాన్ని గణనీయంగా తగ్గించే కొత్త కృత్రిమ అణువును అమెరికన్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయిస్‌కు చెందిన పరిశోధకులు తయారు చేసిన ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవై అనే కృత్రిమ అణువుకు సంబంధించిన వివరాలు అమెరికన్ కెమికల్ సొసైటీ ప్రచురించే ఏసీఎస్ సెంట్రల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈస్ట్రోజెన్ రెసెప్టార్ పాజిటివ్(ఈఆర్ పాజిటీవ్) బ్రెస్ట్ క్యాన్సర్ బాధితుల చికిత్సకు ఈ కృత్రిమ అణువును వినియోగించవచ్చని, ఒకే డోస్‌తో ఇది చిన్న క్యాన్సర్ కణతులను అంతమొందిస్తుందని, పెద్ద కణుతులను తగ్గిస్తుందని పరిశోధకుడు పాల్ హెర్జైన్‌రోథర్ తెలిపారు. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో దాదాపు 70 శాతం మందికి ఈఆర్ పాజిటివ్ క్యాన్సర్ ఉంటుందని అంచనా. వీరికి శస్త్రచికిత్స చేసిన తర్వాత దాదాపు 5 -10 ఏండ్ల పాటు హార్మోన్ థెరపీ అందించాలి.

**సైడ్ ఎఫెక్ట్స్ సమస్య లేకుండా..**

ఇలా ఎక్కువకాలం హార్మోన్ థెరపీ చేయడం వల్ల రక్తం గడ్డకట్టడం, కండరాల నొప్పి, లైంగిక సమస్యలు, అలసట వంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వీటి వల్ల 20-30 శాతం మంది రోగులు మధ్యలోనే చికిత్సను వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ కణాలను అంతం చేసేందుకు 2021లో పాల్ హెర్జైన్‌రోథర్ బృందం ఈఆర్ఎస్ఓ అనే కృత్రిమ అణువును తయారు చేసింది. అయితే,దీనితోనూ సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ ఉండటంతో పలు మార్పులు చేసి ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవైను తయారుచేశారు. ఎలుకలకు ఒకే డోస్ ఇవ్వగా చిన్న కణతులు అంతమయ్యాయి. పెద్ద కణతులు కూడా క్షీణించాయి. మనుషులపై దీని ప్రభావాన్ని తెలుసుకునేందుకు మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని పరిశోధకులు తెలిపారు.

## యాచకురాలికి బిచ్చమిచ్చిన వ్యక్తిపై కేసు

ఇండోర్ : దేశంలోని అత్యంత పరిశుభ్రమైన నగరం ఇండోర్‌లో అరుదైన కేసు నమోదైంది. ఖండ్వా రోడ్‌లోని ఓ దేవాలయం వద్ద బిచ్చగత్తెకు బిచ్చం ఇచ్చిన గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేరం కింద నమోదైన మొదటి కేసు ఇదే కావడం విశేషం. నేరస్థునికి ఒక ఏడాది జైలు శిక్ష లేదా రూ.5 వేలు వరకు జరిమానా లేదా ఈ రెండు శిక్షలు విధించే అవకాశం ఉంటుంది. దేశంలోనే మొదటి బిచ్చగాళ్ల రహిత నగరంగా తీర్చిదిద్దాలని ఇండోర్ అధికారులు నిర్ణయించారు. కేంద్ర సాంఘిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 10 నగరాలను భిక్షాటన రహిత నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా పైలట్ ప్రాజెక్టును ఇండోర్‌లో అమలు చేస్తున్నారు. బిచ్చగాళ్ల సమాచారం చెప్పినవారికి రూ.1,000 బహుమతి ఇస్తున్నారు.

## థాయ్‌లాండ్‌లో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత

బ్యాంకాక్, జనవరి 23: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తూ థాయ్‌లాండ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి. స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన ఆగ్నేయ దేశాలలో థాయ్‌లాండ్ మొదటిది కాగా, ఆసియాలో మూడోది. అంతకుముందు తైవాన్, నేపాల్ దేశాలు దీనిని చట్టబద్ధం చేశాయి. ఎల్‌జీడీటీక్యూ ప్లస్ విభాగంలో ఉన్న వారు స్వలింగ వివాహాలు చేసుకోవడానికి అనుమతి ఇస్తూ ఆ దేశం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం స్వలింగ జంటలు తమ భాగస్వామితో దిగిన ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్లతో సామాజిక మాధ్యమాల్లో హోరెత్తించారు. ఇందులో పలువురు సెలబ్రిటీలు కూడా ఉన్నారు. సెంట్రల్ బ్యాంకాక్‌లోని ఒక షాపింగ్ మాల్‌లో వందలాది జంటలు పాల్గొని దశాబ్దాల నాటి తమ పోరాటం ఇన్నాళ్లకు ఫలించిందని సంతోషం వ్యక్తం చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. ఈ కొత్త చట్టాన్ని థాయ్‌లాండ్ రాజు వజిరాలాంగ్‌కోర్న్ సెప్టెంబర్‌లో ఆమోదించగా, 120 రోజుల తర్వాత గురువారం నుంచి అమలులోకి వచ్చింది.

## తైవాన్‌లో లక్షకుపైగా ఉడుముల వధ

పింగ్‌టుంగ్ (తైవాన్) : వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న ఆకుపచ్చని ఉడుములను పెద్ద ఎత్తున వధించేందుకు తైవాన్ ప్రయత్నిస్తున్నది. ఈ ద్వీపంలోని దక్షిణ, మధ్య ప్రాంతాల్లో దాదాపు 2 లక్షల వరకు ఈ జీవులు ఉన్నట్లు అంచనా. సుమారు 1,20,000 ఉడుములను వధించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ ఉడుములు వ్యవసాయ పంటలపైనే ఆధారపడి జీవిస్తుంటాయని అటవీ పరిరక్షణ సంస్థ చెప్తున్నది. ఇవి చూడటానికి అందంగా ఉంటాయని చాలా మంది వీటిని పెంచుకుంటున్నారు. ఇవి దాదాపు 20 ఏళ్లు జీవిస్తుండటంతో వీటిని అర్థాంతరంగా వదిలేస్తున్నారు. ఫలితంగా వ్యవసాయం, పర్యావరణం దెబ్బతింటున్నాయి. వీటిని సహజంగా వేటాడే జంతువులేవీ ఇక్కడ లేకపోవడం సమస్యను తీవ్రతరం చేస్తున్నది.

## చీమల దండు నేర్పే ట్రాఫిక్ పాఠాలు!

రోమ్, జనవరి 23: చీమలకూ ట్రాఫిక్ సెన్స్ ఉంటుందని, అవి సమన్వయంతో, తెలివిగా ప్రయాణిస్తాయని ఇటలీలోని యానివర్సిటీ ఆఫ్ ట్రెంట్టోకు చెందిన పరిశోధకులు గుర్తించారు. ప్రొఫెసర్లు మార్కో గెరియ్యేరి, నికోలా పుగ్నో నేతృత్వంలో చీమలదండు ప్రయాణంపై నిర్వహించిన అధ్యయనం వివరాలు 'ట్రాన్స్‌పోర్టేషన్ రిసెర్చ్ ఇంటర్‌డిసిప్లీనరీ పెర్స్‌పెక్టీవ్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. డీప్ లెర్నింగ్ ద్వారా చీమల ప్రయాణతీరును గమనించారు. ప్రయాణంలో చీమలు ప్లాటూన్‌గా ఏర్పడటం వంటి అనేక వ్యూహాలు పాటిస్తాయని, ఒకే వేగంతో వెళ్తాయని పరిశోధకులు గుర్తించారు. ఎంత రద్దీ ఉన్నా జామ్‌లు కానివ్వవని, ఓవర్‌టేక్ చేయవని తేల్చారు. మన రోడ్లపై వాహనాలు వెళ్లినట్టుగానే చీమలు సైతం ఇరు దిశల్లో ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. జామ్‌లను నివారించేందుకు చీమలు అనుసరిస్తున్న పద్ధతులను పట్టణాల్లో ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగించవచ్చని పరిశోధకులు సూచించారు. సెల్ఫ్ డ్రైవ్ వాహనాల తయారీలో చీమల ప్రయాణ వ్యూహాన్ని జోడించి సవాళ్లను అధిగమించొచ్చని పేర్కొన్నారు.

# ముందస్తు 'పౌరసత్వ' ప్రసవాలు

- అమెరికాలోని భారతీయ యువ దంపతుల నిర్ణయం
- జన్మతః పౌరసత్వం రద్దుతో పిల్లల భవిష్యత్తుపై బెంగ
- ఫిబ్రవరి 20 నుంచి పుట్టే బిడ్డలకు పౌరసత్వం రానట్టే
- ఈలోగానే సీ సెక్షన్ డెలివరీ చేయించుకునే ప్రయత్నాలు
- నెలలు నిండక ముందే కాన్పుతో తల్లీబిడ్డలకు ప్రమాదం
- జన్మతః పౌరసత్వం రద్దుపై కోర్టులో మొదలైన విచారణ



వాషింగ్టన్, జనవరి 23: జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తున్నది. హెచ్1బీ, స్టడీ వీసాలపై వచ్చిన వారు, గ్రీన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న భారతీయులను ఈ నిర్ణయం కలవరపాటుకు గురి చేస్తున్నది. ముఖ్యంగా బిడ్డలకు జన్మనివ్వాల్సిన యువ దంపతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దీంతో పౌరసత్వం కోసం తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సైతం ప్రమాదంలోకి పెట్టేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులకు ఫిబ్రవరి 20 డెడ్‌లైన్‌గా నిర్ణయించారు. అంటే, ఫిబ్రవరి 19 లోపు అమెరికాలో జన్మించిన బిడ్డలకు జన్మతః పౌరసత్వం లభిస్తుంది. ఆ తర్వాత జన్మించే వారి తల్లిదండ్రుల్లో ఒకరైనా అమెరికన్ పౌరులు లేదా గ్రీన్‌కార్డుదారు అయితే తప్ప పౌరసత్వం రాదు. దీంతో బిడ్డల భవిష్యత్తుపై యువ దంపతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు గర్భంతో ఉండి, మరో రెండు నెలల్లో డెలివరీ జరగాల్సిన వారు ఫిబ్రవరి 19 లోపే డెలివరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం సీ-సెక్షన్లు చేయించుకునేందుకు వైద్యులను సంప్రదిస్తున్నారు.

**ఆరోగ్యానికి ప్రమాదం అని తెలిసినా..**

తనను రెండు రోజుల్లో దాదాపు 20 మంది దంపతులు సీ-సెక్షన్ చేయాలని కోరినట్టు భారత సంతతికి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్‌జీ ముక్కాల తెలిపారు. ఎనిమిది, తొమ్మిదో నెలల గర్భంతో ఉన్న వారు డెలివరీకి సమయం ఉన్నప్పటికీ సీ-సెక్షన్‌తో ఫిబ్రవరి 19 లోపు డెలివరీ చేయాలని కోరుతున్నట్టు న్యూ జెర్సీకి చెందిన డాక్టర్ ఎస్‌డీ రమ చెప్పారు. నెలలు నిండకముందే డెలివరీ చేయడం తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదమని, బిడ్డల్లో ఊపిరితిత్తులు అభివృద్ధి చెందకపోవడం, నాడీ సంబంధ సమస్యలు, తక్కువ బరువుతో జన్మించడం వంటి సమస్యలు వస్తాయని వివరిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కాగా, అమెరికాలో పిల్లలకు జన్మనివ్వడంపై తల్లిదండ్రుల భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంది. అమెరికాలో శాశ్వత నివాసం కోసం ఇచ్చే గ్రీన్‌కార్డులకు భారీగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వందేండ్లయినా గ్రీన్ కార్డులు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. కానీ, ఇక్కడ పిల్లలకు జన్మతః పౌరసత్వం లభిస్తే 21 ఏండ్ల తర్వాత తల్లిదండ్రులకు కూడా శాశ్వత నివాసానికి అనుమతి లభిస్తుంది. అమెరికాలో శాశ్వతంగా స్థిరపడేందుకు ఇది ఒక మార్గం. దీంతో బిడ్డలకు జన్మతః పౌరసత్వం దక్కించుకోవడం కోసం తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు.

**ట్రంప్ ఉత్తర్వులపై కోర్టు విచారణ**

జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సియాటిల్ ఫెడరల్ న్యాయమూర్తి విచారణకు స్వీకరించారు. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ 22 రాష్ట్రాలు, పలు వలసదారుల సంఘాలు దాఖలు చేసిన ఐదు పిటిషన్లలో ఇది ఒకటి. అరిజోనా, ఇలినాయిస్, ఓరెగాన్, వాషింగ్టన్ నుంచి దాఖలైన ఈ పిటిషన్లను న్యాయమూర్తి జాన్ కాఫెనోర్ విచారిస్తున్నారు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం ఇక్కడ జన్మించే బిడ్డలకు పౌరసత్వం లభిస్తుందని, ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌దారులు పేర్కొన్నారు.

**అక్రమ వలసదారుల నిర్బంధ బిల్లుకు ఆమోదం**

అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపేలా కీలక బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం లభించింది. దొంగతనాలు, నేరాల కేసుల్లో నిందితులైన అక్రమ వలసదారులను నిర్బంధించేందుకు వీలుగా లాకెన్ రిలై యాక్ట్ పేరుతో ఈ బిల్లు తీసుకొచ్చారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం లభించడంతో అధ్యక్షుడిగా ఈ పర్యాయం ట్రంప్ సంతకం చేయనున్న మొదటి బిల్లు ఇదే కానున్నది.

**అక్రమ వలసలను వ్యతిరేకిస్తాం : కేంద్రమంత్రి జైశంకర్**

చట్టబద్ధమైన వలసలకే తమ మద్దతు ఉంటుందని, అక్రమ వలసలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. అమెరికా సహా ఏ దేశంలో అయినా తమ పౌరులు అక్రమంగా ఉంటున్నట్లయితే వారికి తిరిగి భారత్‌కు రప్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 18 వేల మంది భారతీయులను వెనక్కు పంపించనున్నారనే వార్తలపై ఆయన ఈ విధంగా స్పందించారు.

## అమెరికాలో తయారు చేయకపోతే సుంకాల మోతే: ట్రంప్

దావోస్: 'మీ ఉత్పత్తులను అమెరికాలో తయారు చేయండి, లేకపోతే అమెరికాలో సుంకాలు చెల్లించాల్సిందే' అంటూ పరిశ్రమలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సును ఉద్దేశించి ఆయన వీడియో సందేశాన్ని పంపించారు. 'అమెరికాకు వచ్చి మీ ఉత్పత్తులను తయారు చేసుకోండి. ఈ భూమి మీద ఏ దేశంలోనూ లేనంత తక్కువ పన్నులు మేం విధిస్తాం. ఒకవేళ మీరు అమెరికాలో ఉత్పత్తులు తయారు చేయకపోతే భారీ సుంకాలు చెల్లించాల్సిందే' అని ట్రంప్ స్పష్టం చేశారు.

## కంప్యూటర్ సైన్స్‌లో టాప్-100లోకి ఐఐఎస్‌సీ

న్యూఢిల్లీ: ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుల వారీగా విడుదల చేసిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాకింగ్స్-2025లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) టాప్-100లో చోటు దక్కించుకుంది. 60.5 స్కోర్‌తో 99వ స్థానంలో నిలిచింది. ఇంజినీరింగ్ సబ్జెక్ట్ ర్యాకింగ్స్-2025లో హార్వర్డ్ విశ్వవిద్యాలయం 97.5 స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాలను స్టాన్‌ఫర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్ దక్కించుకున్నాయి. భారత్‌కు చెందిన అన్నా యూనివర్సిటీ 251-300 ర్యాకింగ్ రేంజ్‌లో నిలిచింది.

## ఎవరెస్ట్ అధిరోహించాలంటే 13 లక్షల ఫీజు

కాఠ్‌మాండూ: ఎవరెస్ట్ శిఖరం అధిరోహణ రుసుమును నేపాల్ ఒక్కసారే భారీగా 36 శాతం పెంచింది. దాంతో పాటు ఆ శిఖరంపై చెత్త, కాలుష్యాన్ని నియంత్రించేందుకు కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. ఆ దేశ కొత్త పర్వతారోహణ నిబంధనల ప్రకారం ఇకపై సాధారణ దక్షిణ మార్గం నుంచి వసంత కాలంలో(మార్చి-మే) ఎవరెస్ట్ ఎక్కాలనుకొనే విదేశీయులు రాయల్టీ రుసుముగా 15,000 డాలర్లు(సుమారు రూ.13 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. శరత్కాలంలో(సెప్టెంబర్-నవంబర్)లో అయితే 7,500 డాలర్లు(రూ.6.48 లక్షలు) చెల్లించాలి. సెప్టెంబర్ 1 నుంచి ఈ ఫీజులు అమలవుతాయి.

## రాహుల్ 'నేతాజీ' ట్వీట్‌పై దుమారం

- ఆగస్టు 18ని 'మరణ తేదీ'గా పేర్కొన్న రాహుల్
- కాంగ్రెస్ నేత తీరుపై బీజేపీ, తృణమూల్ ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ట్వీట్ వివాదాస్పదంగా మారింది. గురువారం నేతాజీ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ 'ఎక్స్'లో రాహుల్ గాంధీ ఒక పోస్ట్ చేశారు. దీనికి నేతాజీ ఫొటోను సైతం జత చేశారు. ఈ ఫొటోపై మరణించిన తేదీ ఆగస్టు 18, 1945 అని రాసి ఉంది. ఈ తేదీన జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారనే ప్రచారంపై వివాదం ఉంది. విమాన ప్రమాదంలో ఆయన మరణించలేదని చాలామంది నమ్ముతున్నారు. దీంతో రాహుల్ గాంధీ పోస్ట్ వివాదంగా మారింది. నేతాజీని అవమానించినందుకు 24 గంటల్లో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్రమంత్రి సుకాంత మజుందార్ డిమాండ్ చేశారు. నేతాజీని దేశ మొదటి ప్రధానిగా ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ట్వీట్ తప్పని, ఆమోదయోగ్యం కాదని తృణమూల్ కాంగ్రెస్ నేత కునాల్ ఘోష్ అన్నారు.

## లాస్ ఏంజెల్స్‌లో మరో కార్చిచ్చు

అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో మరో కార్చిచ్చు రేగింది. కాస్టాయిక్ సరస్సు వద్ద సుమారు 10 వేల ఎకరాల్లో కార్చిచ్చు వ్యాపించింది. 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# కర్ణాటక రాజకీయాల్లో రోజుకో లొల్లి

- కాంగ్రెస్‌లో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలు
- సీఎం, పీసీసీ చీఫ్ పదవులపై గ్రూపు రాజకీయాలు
- బీజేపీలోనూ వీధినపడ్డ నాయకుల వర్గపోరు

బెంగళూరు, జనవరి 23: కర్ణాటక రాజకీయాల్లో రోజుకో రచ్చ మొదలవుతున్నది. ఇంతకాలం కాంగ్రెస్ నేతల మధ్య కనిపించిన విభేదాలు ఇప్పుడు బీజేపీలోనూ తీవ్రంగా మారాయి. హస్తం పార్టీలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య వర్గపోరు కొనసాగుతుండగా, బీజేపీలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిపైనే తిరుగుబాటు మొదలయ్యింది. కమలం పార్టీలోని కీలక నేతలు ఒకరిపై ఒకరు బాహాటంగా దుమ్మెత్తిపోసుకుంటున్నారు. మరోవైపు బీజేపీలో కీలక నేతలు, మాజీ మంత్రులు గాలి జనార్ధన్ రెడ్డి, బీ శ్రీరాములు మధ్య పోరు ముదిరింది. ఒకనాటి మిత్రులైన వీరు ఇప్పుడు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇలా కర్ణాటక అధికార,విపక్ష నేతలు అంతర్గత పోరులో తలమునకలవుతున్నారు.

**కాంగ్రెస్‌లో సిద్దూ వర్సెస్ డీకే**

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాల మధ్య పోరు కొనసాగుతున్నది. బాహాటంగా విమర్శలు చేసుకోకపోయినా ఒకరిపై ఆధిపత్యానికి ఇంకొకరు గ్రూపు రాజకీయాలు నెరపుతున్నారు. సిద్ధరామయ్యను దించితే సీఎం పదవిని దక్కించుకునేందుకు డీకే ప్రయత్నిస్తుండగా, పీసీసీ చీఫ్ పదవిని మరొకరికి ఇప్పించి, డిప్యూటీ సీఎంగా ఇంకా ఒకరిద్దరిని నియమించడం ద్వారా డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు సిద్ధరామయ్య వర్గం ప్రయత్నిస్తున్నది. మరోవైపు గ్యారెంటీల రగడ కూడా పార్టీలో నడుస్తున్నది. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రకటించిన ఈ ఉచితాలను రద్దు చేయాలంటూ కాంగ్రెస్ హైకమాండ్‌ను ధిక్కరించి మరీ ఆ పార్టీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు.

### బీజేపీలో రాష్ట్రాధ్యక్షుడిపైనే విమర్శలు

ప్రతిపక్ష బీజేపీలోనూ విభేదాలు వీధినపడ్డాయి. మాజీ సీఎం యెడియూరప్ప కుమారుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బీవై విజయేంద్రపై నేతలు తిరుగుబాటు చేస్తున్నారు. విజయేంద్ర ఒక బచ్చా అంటూ ఇటీవల గోకక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి విమర్శించారు. బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ సైతం యెడియూరప్ప, విజయేంద్రపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా, గాలి జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు మధ్య విభేదాలు ముదిరి రోడ్డున పడ్డాయి. సండూర్ ఉప ఎన్నికలో ఓటమికి శ్రీరాములే కారణమంటూ జనార్ధన్ రెడ్డి వర్గం బీజేపీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేయగా, బళ్లారి జిల్లాలో జనార్ధన్ రెడ్డి బీజేపీని చీలుస్తున్నారని శ్రీరాములు ఆరోపించారు.

## ఇన్‌కాయిస్‌కు బోస్ ఆప్‌దా ప్రబంధన్ పురస్కారం

### విపత్తు నిర్వహణలో విశిష్ట సేవలకు గుర్తింపు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం(ఇన్‌కాయిస్) ప్రతిష్ఠాత్మక సుభాష్ చంద్రబోస్ ఆప్‌దా ప్రబంధన్ పురస్కార్-2025కు ఎంపికైంది. విపత్తుల నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు సంస్థల విభాగంలో ఈ అవార్డు ఇన్‌కాయిస్‌ను వరించింది. అవార్డు కింద రూ.51 లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రం అందిస్తారని కేంద్ర హోం శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. విపత్తు నిర్వహణకు సంబంధించి అమూల్య, నిస్వార్థ సేవలు అందించిన సంస్థలు, వ్యక్తులకు ఏటా సుభాష్ చంద్రబోస్ ఆప్‌దా ప్రబంధన్ పురస్కార్‌ను అందిస్తారు. 1999లో హైదరాబాద్‌లో స్థాపించిన ఇన్‌కాయిస్ సముద్ర సంబంధిత విపత్తులపై ముందస్తు సమాచారాన్ని, హెచ్చరికలను జారీ చేస్తుంది. ఈ సంస్థలో ఉన్న సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రం పది నిమిషాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేస్తుంది. మన దేశంతో పాటు హిందూ మహా సముద్రం పరిధిలోని 28 దేశాలకు ఈ సేవలను అందిస్తున్నది. యునెస్కో ఈ సంస్థను సునామీ సేవలందించే అత్యుత్తమ కేంద్రంగా గుర్తించింది. సముద్రంలో గల్లంతైన వస్తువులు, వ్యక్తుల జాడను తెలుసుకోవడానికి భారత నౌకా దళ గస్తీ విభాగం కోసం శోధన, సహాయ ఉపకరణాన్ని(సరట్) ఇన్‌కాయిస్ రూపొందించింది.

## ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భారీ డంప్ స్వాధీనం

కొత్తగూడెం ప్రగతి మైదాన్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కోసం గాలిస్తున్న భద్రతా బలగాలు గురువారం సుక్మా జిల్లాలో దుల్లేడ్-మెట్టగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల స్థావరాన్ని గుర్తించి భారీ డంపును స్వాధీనం చేసుకున్నాయి. అలాగే బీజాపూర్ జిల్లాలో బాసగూడ-ఆవపల్లి వెళ్లే మార్గంలో రోడ్డు వద్ద చెప్టా కింద మావోయిస్టులు అమర్చిన మందుపాతరను గుర్తించి అక్కడే పేల్చివేశాయి.

## హిందువులకు కొత్త ప్రవర్తనా నియమావళి

### మహా కుంభమేళాలో విడుదలకు సన్నాహాలు

ప్రయాగ్‌రాజ్: హిందువులు పాటించాల్సిన ఆచార వ్యవహారాలు, పాటించాల్సిన ధర్మాలు, సామాజిక జీవితంలో అనుసరించాల్సి నియమాలపై ఒక ప్రవర్తనా నియమావళి సిద్ధమవుతున్నది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్న క్రమంలో కాశీ విద్వత్ పరిషత్ ఆధ్వర్యంలో తయారవుతున్న ఈ కొత్త హిందూ ప్రవర్తనా నియమావళిని సనాతన ధర్మాన్ని పాటించే వారు చేయాల్సినవి, చేయకూడనివి పొందురిచారు. 300 పేజీలున్న ఈ నియమావళిలోని అంశాలను విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నుంచి జరిగే సమావేశంలో రుషులు, స్వాములు, మతపెద్దలతో చర్చిస్తారు. సాధువులు సహా శంకరాచార్యులు ప్రువీకరించిన తర్వాత వేలాదిగా ముద్రించిన ప్రతులను మహాకుంభమేళాలో భక్తులకు పంపిణీ చేస్తారు.

**కొత్త నియమావళిలో ఏం ఉంది?**

కొత్త హిందూ ప్రవర్తనా నియమావళి రాత్రిపూట జరిగే వివాహాల కన్నా సూర్యుని సమక్షంలో పగటిపూట పెండ్లిండ్లు చేసుకోవాలని సూచిస్తుందని, అలాగే ఆడ శిశు హత్యలను, మహిళల నుంచి కట్నం స్వీకరించడాన్ని వ్యతిరేకిస్తుందని సమితికి చెందిన నేత ఒకరు తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలని, వారు యజ్ఞ, యాగాదులు వంటివి చేయడానికి అర్హులేనని, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తుందని, అన్ని కులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని కోరుతుందని ఆయన చెప్పారు.

## చార్జీల్లో తేడాలపై ఓలా, ఉబర్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: వినియోగదారులు ప్రయాణించే ఒకే దూరానికి సంబంధించి వారు రైడ్ బుక్ చేసే సాధనాలను బట్టి వేర్వేరు చార్జీలు వసూలు చేయడంపై ఓలా, ఉబర్, ర్యాపిడో, ఇతరులకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంగళవారం నోటీసులు జారీ చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని కోరింది. గమ్యస్థానం ఒకటే అయినప్పటికీ అది ఐఓఎస్ నుంచి బుక్ చేసిన వారికి ఒక రేటు, ఆండ్రాయిడ్ 